
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 5 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	586.80 (304.4680)	68,414	39,735
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.20 (3.74)	12,354	17,388
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.73 (42.32)	2,000	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.139 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

వేతలూ తీర్చండి

"గురుబ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురు వేనమః".. అంటూ సమాజంలో గురువులకు మొదటినుంచి గౌరవనీయమైన, ప్రత్యేక స్థానం దక్కింది. భారత తొలి ఉపరాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినమైన సెప్టెంబరు 5న ప్రతియేటా దేశంలో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈసందర్భంగా వివిధ స్థాయిల్లోని ఉపాధ్యాయులకు అవార్డులివ్వడం, ప్రశంసలందించడంతోపాటు గురువుల సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పేద పిల్లలకు.. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యనందించే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ఈ సందర్భంగానైనా పరిష్కరించాలనే సూచనలు ఉపాధ్యాయ వర్గాలనుంచి వస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



- ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గుర్తుచేస్తున్న టీచర్లు
- ఒకటో తేదీ వేతనాల పట్ల సర్వత్రా హర్షం
- పెండింగ్ బిల్లులకు మోక్షం కల్పించాలని విన్నపం
- తక్షణం స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలని సూచన

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటినుంచి ప్రతినెలా 1, 2వ తేదీలలో వేతనాలు ఇస్తుండడాన్ని ప్రశంసిస్తున్న ఉపాధ్యాయులు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులను కూడా ఈ ప్రభుత్వం నిర్వహించడాన్ని ప్రశంసించారు. అయితే ఇంకా కొన్ని సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిపైనా ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లాలనే ఉత్సాహం కలిగే వాతావరణం పాఠశాలల్లో నెలకొల్పాలని, ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ కొనసాగించాలని కోరుతున్నారు.

ఆరోగ్యకార్డులపై నిర్ణయం తీసుకోవాలి

ఉపాధ్యాయ, ఉద్యోగులకు వైద్యసదుపాయాల నిమిత్తం అమల్లో ఉన్న ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం) అమలు సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు వైద్యఖర్చులకు ఇబ్బందులుపడాల్సి వస్తోంది. అత్యవసర సందర్భాల్లో, ప్రధానమైన రోగాలు, జబ్బులు వచ్చినప్పుడు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ స్కీమ్‌ని అమలు చేయకపోతుండడంతో ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో ఈస్కీమ్ స్థానంలో ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్యకార్డులు జారీచేయాలని, ఏ కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా అది అమలయ్యేలా చూడాలని, ప్రత్యేకంగా ఇందుకోసం మూలవేతనం నుంచి 1శాతం మేర కంట్రిబ్యూషన్ కూడా చెల్లిస్తామని గతంలో ఉపాధ్యాయ, ఉద్యోగసంఘాలు ప్రభుత్వాలకు కూడా విన్నవించిన నేపథ్యంలో ఈ ఆరోగ్యపథకం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగుల వైద్యసేవల నిమిత్తం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లు నామమాత్రంగా మారిపోయాయి. వైద్యుల కొరత, మందుల కొరతతో నామమాత్రపు సేవలు కూడా అందకపోవడంతో పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని, ఈ ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలకు చరమగీతం పాడాలని సూచన

పేద, దళిత, గిరిజన, వెనకబడినవర్గాల బాలికలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించే లక్ష్యంతో నెలకొల్పిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ ఉపాధ్యాయులంతా మహిళలే కావడంతోపాటు, వీరంతా తప్పనిసరిగా ఆయా పాఠశాలలున్న చోటే నివసించాల్సి ఉంటుండడంతో ఆమేరకు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. విద్యాబోధనలో చక్కటి పనితీరు కనబరుస్తుండడంతో కేజీబీవీలలో నాణ్యమైన విద్య లభిస్తుండగా, పది, ఇంటర్ పరీక్షల్లో ఈ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పాఠశాలల్లో బోధిస్తోన్న స్పెషలాఫీసర్లు, సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ, క్రాఫ్ట్ టీచర్లు, ఏఎన్‌ఎంలు, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఎవరికీ ఉద్యోగభద్రత లేదని వాపోతున్నారు. ప్రధానంగా ఈ ఉపాధ్యాయులు, ఉద్యోగులంతా కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగుతుండడంతో వీరు సమాన పనికి సమానవేతనం కోసం డిమాండ్ చేస్తున్నారు. రూ.6వేలనుంచి రూ.30వేలకు లోబడే వీరికి వేతనాలుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న అర్హతలే తమకు ఉన్నాయని, పైగా రాత్రివేళల్లోనూ ఉపాధ్యాయులకు డ్యూటీలుండడంతో ఒక్కో ఉపాధ్యాయురాలు కనీసం 32గంటలపాటు ఏకధాటిగా పనిచేయాల్సి వస్తోందని, అలాంటి తమకు ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనాల్లో మూడోవంతు కూడా రావడం లేదని దీన్ని పరిష్కరించి, తమకు సమానవేతనం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలిస్తున్న ప్రభుత్వం తమకు మాత్రం 10వ తేదీ వరకు వేయడం లేదన్నారు. కొన్ని కేజీబీవీల్లో ఎస్‌వోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులకు చెప్పుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాకపోవడంతో తమకు హెల్త్‌స్కీమ్‌లు, ఇన్సురెన్సులేవీ వర్తించడం లేదని, ప్రమాదవశాత్తు గాయాలపాలైనా, లేక మరణించినా ఎలాంటి భరోసా లేకుండా పోయిందని, అనారోగ్యంపాలైతే వైద్యసేవలకు కనీసం హెల్త్‌కార్డులు కూడా లేవని వాపోతున్నారు. వేసవిలోనూ అదనపు తరగతులు నడుపుతూ విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా మెరుగైన ఫలితాలిస్తోన్న తమ కృషిని ప్రభుత్వం గుర్తించి తమకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌చేస్తున్నారు. అదేవిధంగా వైద్య సదుపాయాలు కల్పించేలా హెల్త్‌స్కీం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తమకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వకపోవడంపై కేజీబీవీ అధ్యాపకులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో నడుస్తోన్న కేజీబీవీ ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పలు పాఠశాలల్లో ఇటీవల బదిలీల తర్వాత ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, వాటన్నింటినీ భర్తీ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు స్కావెంజర్ల సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం అంగీకరించి, జీవో విడుదల చేసిందని కానీ స్కావెంజర్ల నియామకాలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయని, తక్షణమే స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలని కోరారు. పలు పాఠశాలల్లో తరగతిగదుల కొరత ఉందని, అదేవిధంగా ఆటస్థలాల ఇబ్బందులున్నాయని వాటన్నింటినీ పరిష్కరించి, ఉపాధ్యాయులు పనిచేసేవాతావరణం పాఠశాలల్లో కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

పెండింగ్ బిల్లులు ఇవ్వాలనేదే ప్రధాన డిమాండ్

ఉపాధ్యాయులకు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణం మంజూరు చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధానంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్లు పెండింగ్‌లో ఉన్నవి పరిష్కరించడంతోపాటు, ఇక నుంచైనా ఉద్యోగ విరమణ రోజునే అన్ని బెనిఫిట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జీపీఎఫ్‌లు, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులకు సంబంధించి ఏళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వీటికి నిధులు మంజూరుచేసి ఆదుకోవాలని కోరుతున్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించేలా మార్గదర్శకాలివ్వాలని కోరుతున్నారు. వీటితోపాటు ప్రధానంగా కొన్నేళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రధాన సవాల్‌గా మారిన సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ని రద్దుచేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ని అమలు చేయాలని కోరుతున్నారు. ఓపీఎస్ అమలుకు ఎన్నికల సందర్భంలో హామీలిచ్చారని, అమలుకు కృషి చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఉపాధ్యాయులకు ఏళ్లనుంచి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. వీటన్నింటినీ తక్షణం మంజూరు చేయాలి. అదేవిధంగా పాఠశాలల్లో స్కావెంజర్ల నియమకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కానీ ఇంకా నియామకాలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలి.

- వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి


పెండింగ్ డీఏలు చెల్లించాలి



ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఒకటో తేదీన వేతనాలిస్తున్న మాదిరిగానే వెంటనే పెండింగ్ డీఏలను కూడా చెల్లించాలి. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా తక్షణమే పెండింగ్ డీఏలు, బిల్లులు క్లియర్‌చేసి ఉపాధ్యాయులు ఉత్సాహంగా పనిచేసే వాతావరణం కల్పించాలి.

- ఎండీ గఫూర్, ప్రాథమిక ఉపాధ్యాయసంఘం, జిల్లా అధ్యక్షుడు

మమ్మల్ని గుర్తించరూ..



భువనగిరి టౌన్, సెప్టెంబరు 4: ఉత్తమ విద్యాబోధనతో పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలనే తపన, తల్లడిల్లే హృదయం, స్పందించే మనసు కలబోసిన రూపమే ఉపాధ్యాయుడు. పిల్లల మనసుకు హత్తుకునేలా తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించగలిగితేనే ఆ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు బాటలుపడతాయి. ఓ సర్వే ప్రకారం పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనా తీరు ఆధారంగానే పిల్లలు ఉన్నత విద్యను, భవిష్యత్‌లో స్థిరపడే రంగాన్ని ఎంపిక చేసుకుంటారని తేలింది. అలాగే ఒక ఉపాధ్యాయుడు తన పూర్తిస్థాయి ఉద్యోగ సమయంలో సుమారు 7వేల మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం లభిస్తుంది. దీంతో ఉపాధ్యాయుడికి అన్ని రంగాలనుంచి జీవితాంతం పూర్వ విద్యార్థుల రూపంలో అనుబంధాలు ఉంటాయి. కాగా పూర్వకాలంలో విద్యార్థులు గురుదక్షిణ సమర్పించుకునే సంప్రదాయం ఉండగా మారిన కాలానుగుణ పరిస్థితుల మేరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వాలు అర్హతలు ఆధారంగా వేతనాలు, ప్రమోషన్లు కల్పిస్తోంది. పూర్తి సర్వీస్ కాలానికి ఉద్యోగ భద్రత ఉంటుంది. కానీ ప్రైవేటు విద్యా వ్యవస్థలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపైనే వారి జీవితాలు ఆధారపడి ఉంటున్నాయి.

ప్రైవేటు ఉపాధ్యాయుల వెతలు

ఉమ్మడి జిల్లాలో సుమారు 3వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సుమారు 10వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ప్రైవేటు రంగంలో కూడా కొద్దిపాటి తేడాతో సుమారు అంతేమంది ప్రైవేటు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. వీరిలో 70శాతం మందికి పైగా రూ.10వేల లోపు వేతనాలు మాత్రమే అందుకుంటున్నారు. తరగతి గదుల్లో రోజంతా నిలబడి పాఠాలు చెప్పడం, నోట్స్ దిద్దడం, ఖాళీ సమయం లేకపోవడం, పైగా తల్లిదండ్రులకు జవాబుదారి తనంగా ఉండాల్సి వస్తుండటం మరింత ఇబ్బందికరమైన పరిస్థితి. విద్యార్థుల వైఫల్యాలకు యాజమాన్యాలు ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తున్నాయి. అంతేగాక నిబంధనల ప్రకారం ప్రతీ ప్రైవేటు ఉపాధ్యాయులకు యాజమాన్యాలు పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాల్సి ఉన్నప్పటికీ అమలు చేస్తున్న దాఖలాలు కన్పించడంలేదు. మితిమీరిన మానసిక, శారీరక ఒత్తిడితో ప్రైవేటు ఉపాధ్యాయుల ఆరోగ్యం క్షీణిస్తోంది. కానీ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళా ప్రైవేటు ఉపాధ్యాయులు అన్ని బాధలను దిగమింగుకుంటూ కుటుంబ అవసరాలకోసం ప్రైవేటు పాఠశాలల్లో వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో నేడు జరుపుకుంటున్న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ స్ఫూర్తితోనైనా తమ సమస్యలను పరిష్కరించాలని ప్రైవేటు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డెంగీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

డీఎంహెచ్‌వో పుట్ట శ్రీనివాస్



శెట్టిపాలెంలో లార్వా సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వేములపల్లి, సెప్టెంబరు 4: ప్రస్తుతం జిల్లాలో ప్రబలుతున్న విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండి, డెంగీరహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌వో పుట్ట శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గ్రామాల్లో ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులు తమ దరికి చేరకుండా చూసుకోవచ్చన్నారు. ప్రతీ గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే నిర్వహిస్తూ జ్వర లక్షణాలు ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించి తగిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో లార్వాల నియంత్రణకు ఫాగింగ్ నిర్వహణ, మురుగుకాల్వల పరిశుభ్రతతోపాటు వ్యర్థ జలాలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, డీఎంవో దుర్గయ్య, హెచ్‌ఏవో ప్రభాకర్, ఎంఎల్‌హెచ్ దత్తాత్రేయ, సోమాచారి, జయమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాములపాడు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. వర్షాకాలంలో ఎక్కువగా పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతవాణి, డాక్టర్ సత్యనారాయణ, కార్తీక్, భార్గవి, సీహెచ్‌వో మోతిలాల్, హెచ్‌ఈవో వెంకన్న, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 4: పనులు సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల భవన నిర్మాణ పనులను బుధవారం జిల్లా స్థానిక సంస్థల విభాగ అదనపు కలెక్టర్ పూర్ణచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. నీటి కుళాయిలు, నీటి సంపులు, బాలికల టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, పంచాయతీరాజ్ డీఈవో జీవన్‌సింగ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి: పాఠశాలల ఆధునికీకరణకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులను అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.22కోట్లు విడుదల చేయగా, పనులు ప్రారంభమయ్యాయి. అయితే భవన నిర్మాణం పూర్తయినా కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ అప్పులు తెచ్చి పాఠశాల భవనాన్ని నిర్మించామని, వడ్డీలు కట్టలేకపోతున్నామని బిల్లులు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో పాఠశాల భవన నిర్మాణం ఎంతవరకయిందని, పాఠశాల గదులు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్‌ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల మొత్తం పూర్తికావడంతో సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల భవనానికి రంగులు ఓ కంపెనీకి అప్పగించారని, వారు వచ్చి రంగులు వేస్తే పాఠశాలను ప్రారంభించవచ్చన్నారు. ఆయనవెంట ఎంపీడీవో చంద్రమౌళి, సీనియర్ అసిస్టెంట్ రమేష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఉన్నారు.

పంట నష్టంపై సర్వే షురూ

- జిల్లాలో 1,856 ఎకరాల్లో పంట నష్టం
- నీట మునిగిన వరి, పత్తి పంటలు



నల్లగొండ, సెప్టెంబరు 4: జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో 1,856 ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. ఈ పంటలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33శాతానికి పైగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతులవారీగా పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. మొత్తం 795 మంది రైతులు పంట నష్ట పోయారు. 33 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లయితే ప్రభుత్వం ప్రకటించిన విధంగా అందజేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేపడుతున్నారు. జిల్లాలో 1,850 ఎకరాలు 33శాతానికి పైగా పంటనష్టం జరిగినట్లు అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలోని దామరచర్ల మండలంలో 120 ఎకరాలు, మాడ్గులపల్లిలో 388 ఎకరాలు, వేములపల్లి మండలంలో 80 ఎకరాలు, గుర్రంపోడులో 3 ఎకరాలు మిర్చి, పెద్దవూర మండలంలో 3 ఎకరాలు వరి పంటలు దెబ్బతిన్నాయి. చందంపేట మండలంలో వరి, పత్తి కలిసి 100 ఎకరాలు దెబ్బతిన్నది. శాలిగౌరారం మండలంలో 185 ఎకరాల వరి, పత్తి పంట నష్టం జరిగింది. కేతేపల్లి మండలంలో 41 ఎకరాలు, చండూరు మండలంలో 10 ఎకరాలు, గుండ్లపల్లిలో 20 ఎకరాలు పంట దెబ్బతిన్నది. నకిరేకల్ మండలంలో 906 ఎకరాల్లో వరి, పత్తి పంట నీట మునిగింది. జిల్లాలో సర్వే పూర్తయిన వెంటనే రైతులవారీగా జాబితాను ప్రభుత్వానికి పంపిస్తామని జేడీఏ శ్రవణ్ కుమార్ తెలిపారు. మూడు, నాలుగు రోజుల్లో ఈ సర్వే పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. పంట నీట మునగడంతో పత్తితో, వరి పంటలు దెబ్బతిన్నాయి.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జానారెడ్డి, పక్కన జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 4: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి అన్నారు. బుధవారం చింతలపాలెం గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు అధికారులతో భూ సమస్యలపై చర్చించారు. ప్రధానంగా మండలంలో ప్రభుత్వ భూముల సమస్య ఉన్నందున మొదటగా సంబంధిత భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ, అటవీ, రెవెన్యూ సరిహద్దులు ఉన్న భూములను గుర్తించి వాటికి హద్దులను నిర్ణయించేలా సర్వేయర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల భూసమస్యల గురించి ప్రధానంగా చర్చించారు. ఈ క్రమంలో జానారెడ్డి అధికారులకు పలు సూచనలు చేస్తూ చెన్నాయిపాలెం, నాగార్జునపేట, గోడుమడక, సుంకిశాలతండా, గట్టుమీదితండా సమస్యలగురించి అధికారులకు వివరించారు. గతంలో ముంపునకు గురైన ఆయా గ్రామాలకు అటవీ ప్రాంతంలో పునరావాసం కల్పించి డీ ఫారెస్ట్ పట్టాలు ఇచ్చినట్లు ప్రస్తుతం ఆ పట్టాలను రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు పరిధి దాటి అటవీ ప్రాంతంలో సేద్యం చేస్తున్న గిరిజన రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు వచ్చేలా ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని అధికారులకు సూచించారు. పునరావాస గ్రామాల్లో అటవీ, రెవెన్యూ సరిహద్దులను గుర్తించేలా జాయింట్ సర్వే నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు తమ భూముల సమస్యల గురించి సమావేశంలో వివరించగా ప్రతీ సమస్యను పరిష్కరించే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నట్లు జానారెడ్డి, జైవీర్‌రెడ్డి తెలిపారు. కాందిశీకుల భూములకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణానాయక్, మునినాయక్, శ్రీనునాయక్, నరసింహ, కొండల్, కాశయ్య, పాండు, రాజులు పాల్గొన్నారు.

మనకూ ఓ హైడ్రా



7

అక్రమార్కుల గుండెల్లో హైడ్రా వణుకు పుట్టిస్తోంది. హైదరాబాద్‌లో హడలెత్తిస్తున్న హైడ్రా ఇప్పుడు మన జిల్లాకూ రానుందన్న వార్తలు వస్తుండడంతో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఆందోళనలో పడ్డారు.

సీపీవోగా వెంకటేశ్వర్లు
బాధ్యతల స్వీకరణ

నల్లగొండ, సెప్టెంబరు 4: జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా(సీపీవో) గూడ వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన 2021 నుంచి 2024 ఫిబ్రవరి వరకు సూర్యాపేట జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పనిచేశారు. 2024 ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు యాదాద్రి భువనగిరి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పనిచేస్తూ నల్లగొండ జిల్లాకు బదిలీపై వచ్చి సీపీవోగా పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు.

ముగిసిన ఐటీఎఫ్ సిరీస్

మాస్టర్-100 పురుషుల డబుల్స్‌లో విజేత ఐజీ చంద్రశేఖర్ రెడ్డి జోడి


6





156 మందిని ఉరిశిక్షను తప్పించడంలో కీలకంగా..

పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా.. ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం.. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం స్థాపించి ఓ విద్యావేత్తగా, పత్రికా సంపాదకునిగా, రాజకీయవేత్తగా స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించారు. 'సత్యమేవ జయతే' అనే నినాదాన్ని వ్యాపింపజేశాడు. విద్యావేత్తగా, రాజకీయవేత్తగా భగవద్గీతను పాటించాలని సూచించారు. సమకాలీన నేతల వలె కుల, మత బేధాలు పోగొట్టడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. సామాజిక కార్యక్రమాలు, విద్య ఉన్నతికోసం పూర్తిగా అంకితం చేయడానికి, 1911లో మాలవ్యా న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి, సన్యాస జీవితం గడిపేందుకు నిశ్చయించుకున్నారు. 1922లో జరిగిన చౌరీ-చౌరా సంఘటన తర్వాత, సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించి 177 మంది స్వాతంత్ర్య సమరయోధుల తరపున వాదించేందుకు 1924లో అలహాబాద్ హైకోర్టు ముందు హాజరయ్యారు. 156 మందిని నిర్దోషులుగా విడుదల చేయడంలో విజయం సాధించాడు. ఓ టీచర్‌గా, న్యాయవాదిగా ఈయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించింది.



ముగిసిన ఐటీఎఫ్ మాస్టర్ సిరీస్

● పురుషుల డబుల్స్‌లో విజేత ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి జోడి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఐటీఎఫ్ పరిశీలకుడు శివకుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, సెప్టెంబరు4 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఐటీఎఫ్ మాస్టర్-100 పురుషుల డబుల్స్ టెన్నిస్ 40+ విజేతగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి జోడి నిలిచింది. బుధవారం నిర్వహించిన ఫైనల్స్‌లో చంద్రశేఖర్‌రెడ్డి, లగ్గాని శ్రీనివాస్‌తో కలిసి రజినీకాంత్ కులకర్ణి, రవితేజ ఉమెంతల జోడీపై 6-2, 6-3 వరుస సెట్లు పైచేయి సాధించి విజేతగా నిలిచారు. దీంతో ఆ జోడీకి సీనియర్స్ పురుషుల డబుల్స్‌లో 100పాయింట్లు లభించి ప్రపంచ ర్యాంకు మెరుగుపడనుంది. అలాగే పలు కేటగిరీల్లో 30 నుంచి 75ఏళ్లమహిళలు, పురుషులకు నిర్వహించిన సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్ ఫైనల్స్ ఉత్సాహంగా సాగాయి. విజేతలకు యాదాద్రి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నద్ది వెంకట్‌రెడ్డి, ఐటీఎఫ్ పరిశీలకుడు శివకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు.నాలుగునెలల వ్యవధిలో జాతీయ, రెండు అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్‌లకు భువనగిరి ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణ టెన్నిస్‌కు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి పరమేశ్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

● మిర్యాలగూడలో క్రీడాసందడి ● తరలివచ్చిన క్రీడాకారులు





పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు, మైదానంలో తలపడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 4 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ ప్రారంభించారు. పోటీల నేపథ్యంలో పట్టణంలో క్రీడాసందడి నెలకొంది. డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో అండర్-11 బాలబాలికల పోటీలకు తెలంగాణ నలుమూలల నుంచి తలిదండ్రులతో తరలి వచ్చిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో 202 ఎంట్రీలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లను మహారాష్ట్రలో జరిగే నేషనల్స్‌కు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో కోచ్ మారబోయిన రామకృష్ణ, చీఫ్ రిఫరీ సోహెల్, మ్యాచ్ కంట్రోలర్ చంద్రశేఖర్, ఎంబీఏ గౌరవ అధ్యక్షుడు మధుబాబు, డాక్టర్ అంజయ్య, నవీన్, శ్రీకాంత్, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, కేతేపల్లి, డిండి, సెప్టెంబరు 4 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను బుధవారం ఉదయం 11 గంటలకు మూసివేశారు. ఈ ఏడాది జూలై 29వ తేదీ నుంచి సాగర్‌కు వరద రాక మొదలైంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఆగస్టు 5వ తేదీన సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద రాక తగ్గడంతో బుధవారం క్రస్ట్‌గేట్లను మూసివేశారు. మొత్తం 36 రోజుల్లో సాగర్ కాల్వలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, క్రస్ట్‌గేట్ల ద్వారా 486 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు మొత్తం 30 రోజుల్లో క్రస్ట్‌గేట్ల ద్వారా 341.40 టీఎంసీలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 85.22 టీఎంసీల నీరు మొత్తంగా 426.22 టీఎంసీల నీరు కడలిపాలైంది. మిగిలిన నీటిని కుడి కాల్వకు 28.76 టీఎంసీలు, ఎడమ కాల్వకు 20.37 టీఎంసీలు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 8.87 టీఎంసీలు, వరద కాల్వ ద్వారా 1.38 టీఎంసీల నీటిని సాగర్ నుంచి విడుదల చేశారు. దీంతో సాగర్ నుంచి మొత్తం 486 టీఎంసీల నీరు విడుదల చేశారు.

గరిష్ఠానికి నాలుగు అడుగులు తక్కువగా...

సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,55,003 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 68,414 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 586.80అడుగులుగా(304.4680టీఎంసీలు) ఉంది. గరిష్ఠ మట్టానికి 4అడుగుల తక్కువగా ఉంది. సాగర్ నుంచి 39,735 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 68,414 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల గేట్లు మూసివేత

తెలుగురాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుగేట్లను అధికారులు మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు (45.77టీఎంసీలు)కాగా బుధవారం సాయంత్రానికి 172.73అడుగులుగా(42.32టీఎంసీలు)ఉంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్‌ఫ్లో వస్తుండగా తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 104 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. అవుట్‌ఫ్లో 16వేల క్యూసెక్కులుగా నమోదైంది.

ఏడు గేట్ల నుంచి దిగువకు మూసీ నీరు

నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు వరదపోటు కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 12,354 క్యూసెక్కులు ఉండగా ఏడు క్రస్ట్‌గేట్ల నుంచి 17,388క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు(4.46 టీఎంసీలు)అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 642.20అడుగులుగా (3.74 టీఎంసీలు) నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నదీ


వలిగొండ: హైదరాబాద్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలోని మూసీ నదీలోకి భారీగా వరదనీరు మూసీ నదీలోకి చేరుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం భీమలింగంకత్వ వద్ద బుధవారం ఉదయం మూసీనదీ ఉగ్రరూపం దాల్చింది. వరదనీరు భారీగా వస్తుండడంతో అప్రమత్తమైన అధికారులు సంగెం-బొల్లేపల్లి కల్వర్టుపై వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. సమీప గ్రామాల ప్రజలు ప్రత్యామాయంగా వలిగొండ మండలకేంద్రం నుంచి భువనగిరికి వెళ్లారు. మధ్యాహ్నం వరద ఉధృతి తగ్గి వరద కల్వర్టు కింది భాగం నుంచి ప్రవహించడంతో అధికారులు పరిమితసంఖ్యలో రైతులు, వాహనాలను అనుమతించారు.

డిండి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

నల్లగొండ జిల్లా సరిహద్దులోని డిండి ప్రాజెక్టుకు దుందుభివాగు నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి 19వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు జేఈ ఫయాజ్ తెలిపారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు కాగా పూర్తిస్థాయిలో నీరు నిల్వచేశారు. అలుగు పైనుంచి నీరు వెళ్తోంది. అదేవిధంగా ఎడమకాల్వ పరిధిలోని చెరువులు, కుంటలు నింపేందుకు 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భారీవర్షం పడింది. రెండుగంటల పాటు కురిసిన వర్షానికి గ్రామాలు అతలాకుతలమయ్యాయి. 6సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ యాదగిరి తెలిపారు. శాలిగౌరారం నుంచి ఉట్కూర్ రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్ట్ మీద వరద పారుతోంది.




ఉపాధ్యాయులు.. దేశంలో అత్యుత్తమ ఆలోచన గలవారు

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సర్వేపల్లికి చెందిన రాధాకృష్ణన్‌ది నిరుపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించలేని ఆయన తండ్రి అర్చకత్వం చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. అప్పటి నుంచి ఆయన చదువంతా స్కాలర్ షిప్‌లతోనే సాగింది. భోజనం చేసేందుకు అరిటాకు కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రం చేసుకొని, భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలా చదువుకొని, అంచలంచెలుగా ఎదిగిన సర్వేపల్లి పాఠాలు బోధిస్తుంటే విద్యార్థులు కనురెప్ప వాల్చలేరనడంలో అతిశయోక్తిలేదు. ఉపాధ్యాయులు దేశంలో అత్యుత్తమ ఆలోచన గలవారు అని అంటారు. దేశానికి తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పనిచేశారు.



అపజయాల మీది నుంచీ ఎదగడం నేర్చుకోవాలి

అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం తమిళనాడులోని రామేశ్వరంలో ఒక నిరుపేద ముస్లిం కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుంచి ఏదో ఒక పనిచేసుకుంటూ.. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ చదువుకున్నారు. ఉదయం పూట పేపర్ బాయ్‌గా పనిచేస్తూ.. మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లేవారు. 'జీవితంలో కష్టాలు సహజమని, అపజయాల మీది నుంచీ ఎదగడం నేర్చుకోవాలి' అంటారు. చిన్నతనంలోనే ఏరోనాటికల్ ప్రవేశ పరీక్షలో ఎనిమిది సీట్లు ఉండగా, 9వ ర్యాంక్ రావడంతో సీటు ఇవ్వలేదు. దీంతో ఆయన నిరాశ చెందకుండా లక్ష్యాన్ని చేరుకుంటానని నాడే నిశ్చయించుకున్నారు. శాస్త్రవేత్తగా ఎదిగిన ఆయన, రాష్ట్రపతి అయ్యాక త్రివిధ దళాధిపతిగా యుద్ధ విమానం నడిపి చరిత్ర పుటల్లోకెక్కారు. టీచర్‌గా, ప్రొఫెసర్‌గా నిత్యం విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే ఉండేవారు. చివరగా ఓ యూనివర్సిటీలో పాఠాలు బోధిస్తూ తుది శ్వాస విడిచారు.



విద్యతో పాటు సంస్కారం నేర్పించారు



సుద్దాల అశోక్‌తేజ, సినీ గేయ రచయిత

ఆనాటి గురువులు విద్యతో పాటు సంస్కారం నేర్పించారని సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆయన్ను పలుకరించగా తనకు విద్యాబుద్ధులు చెప్పిన ఆ నాటి ఉపాధ్యాయుల గురించి గుర్తుచేశారు. మల్లయ్య సారు నాకు ఓనమాలు (అక్షరాలు) దిద్దించారు. ఆయనకు ఇప్పుడు 90 ఏళ్లు ఉంటాయి. కడవెండిలో ఉంటున్నారు. మా నాన్న సుద్దాల హన్మంతుతో ఆయన సన్నిహితంగా ఉండేవారు. నేను 3వ తరగతిలో ఉన్నప్పుడు మా పాఠశాలకు పాండు రంగయ్య సార్ వచ్చారు. ఆయన నాకు 3వ తరగతిలోనే ముఖానికి రంగు వేసి స్టేజీ ఎక్కించారు. అప్పటి నుంచి ఆ సారు సహకారంతో నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నా. ఆయన, ఆయన సతీమణి సరోజన నన్ను తమ కుటుంబ సభ్యుడిగా చూసేవారు. పాండురంగయ్య సారు నాకు సినిమా, పౌరాణిక కథలు చెప్పేవారు. ఆయన బోధనలతోనే నాపై సాంస్కృతిక ముద్ర పడింది. మా తండ్రి సుద్దాల హన్మంతు సహజ కవి, గాయకుడు కావడంతో నేను అటు పాండురంగయ్య సారు, ఇటు అమ్మానాన్నలు ప్రోత్సాహంతో గేయ రచయితగా స్థిరపడి సినిమా రంగంలో ప్రవేశించి రాణించగలుతున్నా. పలు అవార్డులు, రివార్డులు అందుకున్నా. నా కళారంగ జీవితానికి పునాది వేసింది మాత్రం పాండురంగయ్య సారే. ఏ స్థాయికి ఎదిగినా అందుకు గురువుల పాత్ర ఖచ్చితంగా ఉంటుంది. ఎంతోమంది గురువులు తమ విద్యార్థుల భవిత కోసం శ్రమిస్తుంటారు.

- మోత్కూరు

అంకితభావంతో పనిచేసేవారు



మోత్కూరు నరహరిశాస్త్రి, రిటైర్డ్ ప్రిన్సిపాల్

నాటి ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించేవారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే తపన ఉండేదని ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య (ఓరియంటల్) కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మోత్కూరు నరహరి శాస్త్రి అన్నారు. తనకు విద్యాభ్యాసం చేసిన నాటి గురువుల నిబద్ధత గురించి చెబుతూ 1956లో మోత్కూరు ఉన్నత పాఠశాలలో చేరిన తర్వాత రామనర్సయ్యసారు హెచ్‌ఎంగా ఉండగా, రామప్పయ్య సారు గణితం, గోవర్ధన్ సారు హిందీ, తిరునగరి శ్రీనివాస్ తెలుగు బోధించేవారు. తెలుగు మాస్టారు శ్రీనివాస్ సారు ప్రోత్సాహంతో పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో నేను కవితలు రాసి చదివేవాడిని. గొల్ల సుద్దులు చెప్పేవాడిని. ఆయన కవులు, కవిత్వం, దేశ నాయకుల గురించి చెబుతూ విద్యార్థులను ఉత్తేజ పర్చేవారు. అప్పుడే నాకు ఉపాధ్యాయుడిని కావాలన్న కోరిక కలిగింది. 1964లో నాకు ఎల్‌డీసీ ఉద్యోగం వచ్చినప్పటికీ మూడేళ్లు ఆ ఉద్యోగం చేసి తెలుగులో డిప్లొమా, ఆ తర్వాత ఎంఫిల్ చేసి అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించా. తిరునగరి శ్రీనివాస్ ఇచ్చిన స్ఫూర్తితో లెక్చరర్‌గా, ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశా. పూర్వం ఉపాధ్యాయులు ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడే నివసించేవారు.వారికి చిన్నచిన్న పనులు చేస్తూ సేవ చేసేవారం. వారితో అనుబంధం ఏర్పడేది. ఇప్పుడు అలా లేదు.దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ముఖాముఖి చర్చ జరగడం లేదు. అనుబంధం ఏర్పడటం లేదు. తమ పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు ఎవరనేది విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియని పరిస్థితి నేడు ఉంది.

- మోత్కూరు

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఎవరెస్టు అధిరోహించా



పడమటి అన్విత, పర్వతారోహకురాలు

నా ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు భువనగిరిలోనే విద్యాభ్యాసం సాగింది. అనంతరం హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళాసభ కళాశాలలో ఎంబీఏలో చేరా. ఈ క్రమంలో భువనగిరి ఖిల్లాపై సాగుతున్న పర్వతారోహణ శిక్షణను తిలకించి భవిష్యత్‌లో పర్వతారోహకురాలిగా రాణించాలనే సంకల్పంతో ఎవరెస్టర్ శేఖర్ బాబు సారు ప్రోత్సాహంతో ప్రాథమిక శిక్షణ తీసుకున్నా. ఎంబీఏలో చేరాక హిమాలయా పర్వతాలపై నెల రోజుల శిక్షణకు వెళ్లాల్సి వచ్చింది. అదే సమయంలో కళాశాలలో విద్యార్థులకు బయోమెట్రిక్‌ను అమలులోకి తీసుకువచ్చారు. అయితే కళాశాలలో చేరిన మొదటి నెలలోనే హిమాలయాలకు వెళ్లేందుకు నెల రోజుల సెలవుల కోసం దరఖాస్తు చేసుకుంటే టీసీ తీసుకుని వెళ్లమని ప్రిన్సిపల్ అన్నారు. దీంతో అయోమయానికి గురైన నన్ను గమనించిన కళాశాల ఫ్యాకల్టీ, డైరెక్టర్ డాక్టర్ కే విజయలక్ష్మీ ప్రిన్సిపాల్‌ను ఒప్పించి నెలరోజుల సెలవులు మంజూరు చేయించారు. ఆ ఇద్దరు అందించిన ప్రేరణతోనే నేను ఎవరెస్ట్‌తో పాటు ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన మరో నాలుగు పర్వతాలను అధిరోహించి దేశవ్యాప్త గుర్తింపు పొందా. జీవితాంతం వారి రుణపడి ఉంటా. వారి ప్రోత్సాహాన్ని మరువలేను. నా ప్రతీ అడుగులో ధైర్యాన్ని, మనో నిబ్బరాన్ని నింపింది ఉపాధ్యాయులే.

-భువనగిరి టౌన్

మనకూ ఓ హైడ్రా

- సీఎం ఆదేశాలతో ఏర్పాటుకు రంగం సిద్ధం!
- ఆక్రమణదారుల గుండెల్లో వణుకు

'హైదరాబాద్ పట్టణ పరిరక్షణ కోసం తీసుకువచ్చిన హైడ్రా(హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ) వంటి వ్యవస్థలను జిల్లాలోనూ తీసుకువస్తాం, కలెక్టర్ పర్యవేక్షణలో కమిటీని ఏర్పాటు చేసి ఆక్రమణ తొలగింపునకు కృషి చేస్తాం'

- ఖమ్మం జిల్లాలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 4: హైడ్రా తరహాలో ఓ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్న సీఎం ప్రకటనతో జిల్లాల్లో ఆ మేరకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా కలెక్టర్ల పర్యవేక్షణలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలను తొలగించేందుకు ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడంతో అందుకు సంబంధించి కసరత్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఆక్రమణదారుల గుండెల్లో వణుకు పుడుతోంది. పట్టణంలోని ఊరచెరువు, నాగులకుంట, పలునాలాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటిలో పెద్దపెద్ద భవనాలు వెలిశాయి. యదేశ్చగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. ఆక్రమణలకు సీఎం ప్రకటనతో అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల వారీగా హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అన్నిరకాల ఆక్రమణలను తొలగించాలని సీఎం ఆదేశాలు జారీ చేయడంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఊరచెరువు, నాగులకుంటల్లో అక్రమనిర్మాణాలు

చౌటుప్పల్‌లోని ఊరచెరువు, నాగులకుంటలో అక్రమనిర్మాణాలు సాగుతున్నాయి. ఊర చెరువు అలుగు వద్ద అక్రమ నిర్మాణాలు చెరువు కట్టకు ప్రమాదకరంగా మారాయి. మూడేళ్లకిందట రెండు, మూడు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండి అలుగు పోసేందుకు అక్రమ నిర్మాణాలు తీవ్ర ఆటంకంగా మారాయి. ఒక దశలో చెరువు కట్ట తెగిపోతుందన్న భయాందోళనలు ప్రజల్లో నెలకొన్నాయి. అలుగుకు దిగువతో పాటు ఎగువన చెరువులో సైతం అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చివరకు చెరువు కట్టను కూడా ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపట్టారు. మొత్తంగా ఊర చెరువు ప్రమాదంలో పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు చెరువు కట్ట తెగితే చౌటుప్పల్ పట్టణం సగం వరకు కొట్టుకుపోవడం ఖాయమంటున్నారు. అదే జరిగితే పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నాగులకుంట సైతం అక్రమ నిర్మాణాలకు నిలయంగా మారింది. మూడు నుంచి నాలుగు ఎకరాల మేరకు ఆక్రమణకు గురైంది. నాగులకుంటలో చుట్టుఅక్రమ నిర్మాణాలతో నిండింది. కట్టపై కూడా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చెరువు, కుంటల్లోని శిఖం భూములతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాలు వెలిశాయి.

- రెవెన్యూ రికార్డుల ప్రకారంగా సర్వే నెంబరు 363లో ఊరచెరువు శిఖం భూమి 33.37 ఎకరాల భూమి ఉంది. ఈ చెరువుకు ఎఫ్‌టీఎల్ పట్టా భూమిలో ఉండగా, దానికి అదనంగా 30 మీటర్ల వెడల్పుతో చుట్టురా బఫర్‌జోన్ ఉంటుంది. అదే విధంగా సర్వే నెంబరు 322లో నాగులకుంట శిఖం భూమి 11.32 ఎకరాల్లో ఉంది. ఈ భూమికి శిఖం భూమి వెంట ఎఫ్‌టీఎల్ ఉంటుంది. ఈ భూమికి చుట్టూరా 9 మీటర్ల వెడల్పుతో బఫర్‌జోన్ ఉంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూములకు చుట్టుపక్కల సర్వే నెంబర్లు వేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు. ఇలాంటి అక్రమ కట్టడాలకు గ్రామపంచాయతీ అధికారులు ఇంటి నెంబర్లు వేసి తోచినంత దండుకున్నారన్న ఆరోపణలున్నాయి.

హైడ్రా కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

హైడ్రా వంటి వ్యవస్థ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. చెరువు, కుంటలతో పాటు నాలాలు, బఫర్ జోన్‌లు, ఎఫ్‌టీఎల్‌లను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములు, భూదాన్‌భూములు, సీలింగ్ భూములు ఆక్రమణకు గురయ్యాయి. చివరకు ఇండోర్ స్టేడియంతో పాటు గాంధీపార్క్ స్థలాన్ని సైతం కబ్జాచేయడంతో కుంచించుకుపోయాయి.

పూర్తి అధికారాలిస్తే ఆక్రమణలను తొలగిస్తాం

హైదరాబాద్‌లో హైడ్రాకు ఇచ్చిన విధంగానే జిల్లా స్థాయి కమిటీకి పూర్తి అధికారాలు ఇచ్చిన పక్షంలో అన్నిరకాల ఆక్రమణలను తొలగిస్తామని జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసే కమిటీలో అన్నిశాఖల అధికారులను నియమించాలని, అలాచేసిన పక్షంలో ఆక్రమణల తొలగింపు సునాయాసంగా జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేయనుందని, అందుకు ప్రజలు కూడ స్వాగతించడం హర్షనీయమన్నారు.

బఫర్‌జోన్ అంటే..

చెరువులు, కుంటల కట్ట వెంట కింది భాగంలో 30 అడుగుల వెడల్పుతో బఫర్ జోన్ ఉంటుంది. ఇది పట్టా భూమి అయినా నిర్మాణాలను చేపట్టరాదు. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధి 25 ఎకరాల వరకు ఉంటే చుట్టూ 9 మీటర్లు మేర బఫర్‌జోన్ ఉంటుంది. ఎఫ్‌టీఎల్ 25 ఎకరాలకు మించి ఉంటే చుట్టూరా 30మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్ కింద ఉంటుంది. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో ఎలాంటి కట్టడాలను చేయరాదు. ప్రభుత్వ, పట్టా భూములు ఉన్నా సరే నిర్మాణాలను చేయకూడదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లకు నిర్ధారించిన భూములలో గ్రీనరీ తప్ప ఎలాంటి చేర్పులు, మార్పులు చేయకూడదు. చివరకు ఈ భూముల్లోని మట్టి కుప్పలు వేసి చదును కూడా చేయకూడదు. అవకాశం ఉంటే వ్యవసాయం చేసుకోవచ్చు.

నాగులకుంట సమీపంలో శాశ్వత నిర్మాణాలు



ఇరవై ఏళ్లలో మూడుసార్లు వరద

చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి రోడ్డు, చిన్న కొండూరు రోడ్డులోని నాలాలను ఆక్రమించి నిర్మాణాలను చేశారు. దీంతో వర్షాల సమయంలో వరద సజావుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 2005, 2020, 2021లలో కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని సగభాగం జలమయమైంది. 2005 అక్టోబరు 28, 29 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు వారం రోజుల వరద నీరు జాతీయ రహదారిపై పారగా, 10 రోజుల పాటు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోకి బస్‌లు వెళ్లలేదు. అదేవిధంగా 2020, 2021లలో కురిసిన భారీవర్షాలకు పట్టణం జలమయమైంది. అనేక కాలనీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు నీటమునిగాయి. చెరువు అలుగు వద్ద చేసిన అక్రమ నిర్మాణాలతో పాటు నాలాల ఆక్రమణతో వరద నీరు ముందుకు సజావుగా వెళ్లలేక ఇళ్లలోకి చేరింది. గాంధీ పార్క్‌లో చేరిన వరద నీటిని బయటకు పంపించేందుకు మునిసిపల్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అదేవిధంగా హ్యాండ్లూమ్ మార్కెట్ వీధిలోకి చేరిన వరదతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. చెరువు తూం వద్ద నుంచి దిగువ భాగానికి వెళ్లే నీటి కాల్వను కుదించి అక్రమ నిర్మాణాలను చేపట్టారు. రోజుల తరబడి వరద నీటితో పట్టణ ప్రజలు తీవ్రఇబ్బందులను ఎదుర్కొన వలసి వచ్చింది.అండర్‌గ్రౌండ్ ఇళ్ల యజమానుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ సమస్య అంతా నాలాల ఆక్రమణతోనే తలెత్తింది. వచ్చిన నీరు వచ్చినట్టుగానే వెళ్లి పోతే ఈ పరిస్థితి ఉండేది కాదు.



ఆక్రమణల వల్లే కోదాడ మునక


- ముంపునకు 1500 కుటుంబాలు
- ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలకు పైబడి నష్టం
- నష్ట అంచనాలు సేకరిస్తున్న అధికారులు

కోదాడ, సెప్టెంబరు 4 : సూర్యాపేట జిల్లా కోదాడలోని చాలా కాలనీలు ఇటీవల వర్షాలకు మునిగిపోయాయి. 1500 కుటుంబాలు ముంపునకు గురయ్యాయి. ఒక్కో కుటుంబంలో వర్షం తీరని నష్టాన్ని, దుఃఖాన్ని మిగిల్చింది. స్థానిక పెద్దచెరువు, ఎర్రకుంట చెరువు, ఎన్ఎస్పీ, పంటకాల్వల ఆక్రమణలతోనే కాలనీలు వరద ముంపు గురయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోదాడ పెద్దచెరువు 700 ఎకరాల విస్తీర్ణం ఉండగా 300ఎకరాలు ఆక్రమణ గురైంది. ఆక్రమణతోనే లోతట్టు ప్రాంతాలైన నయానగర్, శ్రీనగర్, షిర్డీనగర్‌కాలనీలు వరద తాకిడి ఎదుర్కోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఎర్రకుంటచెరువు 48 ఎకరాలు కాగా ఇళ్ల నిర్మాణం, వ్యవసాయం పేరుతో సుమారు 33ఎకరాలు ఆక్రమించినట్లు స్థానికులు ఆరోపించారు. అంతేకాక చెరువు దిగువ ఉన్న పంటకాల్వ ఆక్రమణకు గురికావటంతో శ్రీరంగపురం, భవానీనగర్ కాలనీలు ముంపు గురికావాల్సి వచ్చిందని కాలనీవాసులు వాపోతున్నారు. అదేవిధంగా ఎన్ఎస్పీ కాల్వ ఆక్రమణతోనే శ్రీమన్నారాయణకాలనీ వరద తాకిడి చవిచూడాల్సి వచ్చిందని కాలనీవాసులు చెపుతున్నారు. మొత్తంగా ఆయా కాలనీలలో సుమారు 15వందలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నారు. గత నెల 31న కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి ఒక్కో కుటుంబం రూ.2 లక్షల వరకు నష్టానికి గురైంది. అదేవిధంగా ఆయా కాలనీల్లో సుమారు 50కార్లు వర్షపు నీట మునిగాయి. కార్ల రిపేరుకు లక్షల్లో ఖర్చు వస్తుందని బాధితుడు వీ శ్రీనివాసరావు తెలిపారు.



కోదాడ ప్రధానరహదారిలో దుకాణాల వద్ద డ్రైనేజీలపై సిమెంట్ దిమ్మెలను తొలిగిస్తున్న పోలీసులు

అలుగులు తొలగించి ఆక్రమణలు



ఎర్రకుంట అలుగు తొలిగించి అక్రమనిర్మాణాలు చేయడం వల్లే భవానీనగర్, శ్రీరంగాపురం కాలనీలు మునిగాయి. మిషన్‌కాకతీయ పేరుతో చెరువుల తవ్వకాలు చేపట్టినా అలుగులను మరిచారు. దీంతో వరద తాకిడికి గ్రామాలు ముంపుకు గురయ్యాయి. అంతేకాక కోదాడ పెద్ద చెరువు, ఎన్ఎస్పీ కాలువలు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. ఇరిగేషన్ ఎసీఈ, డీఈ, ఏఈలు ఉన్నా ఎన్నడూ చెరువులను, కాల్వలను పట్టించుకోలేదు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ నష్టనివారణ చర్యలు చేపట్టి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

-కుదరవెల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త

ఇద్దరు చైన్‌స్నాచింగ్, బైక్ దొంగల అరెస్ట్ : ఎస్పీ

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 4 : చైన్‌స్నాచింగ్‌లు, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట జిల్లా సీసీఎస్, తిరుమలగిరి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 13 బైక్‌లు, 3.7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తిరుమలగిరి పోలీసులు బుధవారం ఉదయం పట్టణంలోని క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీచేస్తున్నారు.ఆ సమయంలో తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామానికి చెందిన కూలీ పనిచేసే పోలేపాక రమేష్, అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పెయింటింగ్ పనిచేసే జీడి నరేష్ బైక్‌పై సూర్యాపేటకు వెళ్తున్నారు. తిరుమలగిరి క్రాస్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీలు చేయడాన్ని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆగస్టు 2020లో తిరుమలగిరి మండలం మామిడిపల్లి గ్రామ ఆవాసం హరిచంద్రతండా సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న బానోత్ భారతి మెడలోని బంగారు ఆభరణాన్ని చోరీ చేసినట్లు అంగీకరించారు. అనంతరం అప్పటి నుంచి నిందితుడు రమేష్ ఒంటరిగా తుంగతుర్తి, శాలిగౌరారం, కొడకండ్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లు, సూర్యాపేట పట్టణం, రూరల్, కేతేపల్లి, నకిరేకల్, తొర్రూర్, జనగాం, ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్‌ల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో కేసులు నమోదు చేసి రమేష్ గ్రామం గానుగబండలో నిందితుడి ఇంటి వద్ద 3.7తులాల బంగారు ఆభరణాలు, నిందితులు ఉపయోగించే బైక్‌తో పాటు మరో ఎనిమిది బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నిందితుల నుంచి నాలుగు బైక్‌లను కేతేపల్లి మండలం ఇనుపాములకు చెందిన వంగూరు క్రిష్ణ, జిల్లేపల్లి నరేష్ కొనుగోలుచేశారు. ఆ బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. చోరీలకు గురైన బైక్‌లను కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణ చేసి వారిపై కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి మొత్తం రూ.1.49లక్షల విలువైన 3.7తులాల ఆభరణాలు, రూ.3.95లక్షల విలువైన 13 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా చోరీలకు పాల్పడిన పోలేపాక రమేష్‌పై 2018 నుంచి సూర్యాపేటరూరల్, దంతాలపల్లి, తుంగతుర్తి, కొడకండ్ల, లింగాలఘనపూర్, భువనగిరి, ఆత్మకూర్(ఎస్), తొర్రూర్, సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో 12 కేసుల్లో నేరాలకు పాల్పడినట్లు వివరించారు. ఇద్దరు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న తిరుమలగిరి, సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు. సమావేశంలో సీసీఎస్, నాగారం సీఐలు శివకుమార్, రఘువీర్‌రెడ్డి తిరుమలగిరి, సీసీఎస్ ఎస్‌ఐలు సురేష్, శ్రీకాంత్, సిబ్బంది చనగాని వెంకన్న, చామకూరి శ్రీనివాస్, గురుస్వామి, ఆనంద్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

బెల్ట్‌షాపుల నిర్మూలించే గ్రామాలకు అభివృద్ధి నిధులు

మునుగోడు, సెప్టెంబరు 4: బెల్ట్‌షాపులను నిర్మూలించే గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అందుకు గ్రామాల ప్రజలు పోటీపడాలని పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ జిల్లా మునుగోడులోని తన క్యాంప్ కార్యాలయంలో పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. బెల్ట్‌షాపులను నిర్మూలించిన కచలాపురం, జక్కలవారిగూడెం గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి, మాట్లాడారు. ఆయాగ్రామాలకు మొదటి ప్రాధాన్యంగా ఒక్కో గ్రామానికి రూ.10లక్షలు చొప్పున అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రహదారుల అభివృద్ధి, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపునకు రూ.15లక్షలు నిధులు మం జూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయా పనులను ఈ నెల 5న నుంచి మొదలుపెట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గవ్యాప్తంగా 50.75కిలోమీటర్ల పొడవున 26 రోడ్లకు రూ.48కోట్లు నిధులు మంజూరయ్యాయని గుర్తుచేశారు. అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.10కోట్లు, పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్ల నిర్మాణానికి రూ.63 కోట్లు, దెబ్బతిన్న 49 రహదారుల మరమ్మతుల కోసం రూ.48కోట్లు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.47కోట్లు అవసరమన్న విద్యుత్ శాఖాధికారుల ప్రతిపాదన మేరకు ఎమ్మెల్యే వెంటనే ఆ శాఖ సీఎండీతో ఫోన్లో మాట్లాడి నిధుల విషయంపై చర్చించారు.



బెల్ట్‌షాపులను నిర్మూలించిన జక్కలవారిగూడెం గ్రామస్తులను సన్మానించిన రాజగోపాల్‌రెడ్డి

చికిత్స పొందుతూ మహిళ మృతి

తిప్పర్తి, సెప్టెంబరు 4 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగింది. ఏఎస్ఐ జమాల్ తెలిపిన వివరాల ప్రకారం యల్లమ్మగూడెం గ్రామానికి చెందిన ఆదిమళ్ల లక్ష్మమ్మ(50) ఏడాది నుంచి మెడపై కణితి సమస్యతో బాధపడుతోంది. చికిత్స చేయించినా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపంతో అదేగ్రామంలోని కుమార్తె కోళ్ళ ఫారం వద్ద ఈ నెల 2న ఎవరూ లేనిసమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆలస్యంగా చూసిన కుటుంబసభ్యులు నకిరేకల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నల్లగొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. లక్ష్మమ్మ పెద్దకుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు-ట్రాక్టర్ ఢీకొని ముగ్గురికి గాయాలు

అనంతగిరి, సెప్టెంబరు 4 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ శివారులో ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న హైవేపైకి సర్వీసు రోడ్డు నుంచి ట్రాక్టర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా తీసుకువచ్చాడు. అదే సమయంలో విజయవాడ నుంచి ఖమ్మం వయా కోదాడకు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పవన్, డ్రైవర్ గోపీలకు గాయాలయ్యాయి. అదేవిధంగా ట్రాక్టర్ డ్రైవర్ కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. కారు యజమాని షేక్ ఫహీద్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 4 : విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని ఎల్లాపురం తండాలో బుధవారం జరిగింది. బాధిత పాడి రైతు ధనావత్ హరిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే మంగళవారం తన పాడి ఆవు మేతకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా పశువుల కొట్టంలో కట్టివేశాడు. రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా ఈదురుగాలులకు కొట్టంలోని సర్వీస్ విద్యుత్ వైర్ తెగి ఆవుపై పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఆవు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు హరిచంద్ర కోరారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీ

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 4: యాదాద్రిభువనగిరి చౌటుప్పల్ మండలం జైకేసారంలో గ్యాస్‌పైపులైన్ లీకేజీ కావడం, సిబ్బంది అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. మెయిల్ కంపెనీ సుంకిశాల నుంచి గ్యాస్ పైపులైన్ చౌటుప్పల్ వరకు వేసి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. ఓ పరిశ్రమ జాలు కాల్వ నుంచి మంచినీటి పైపులైన్ జైకేసారం మీదుగా వేస్తున్నారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ గ్యాస్ పైపులైన్ గమనించకుండా తవ్వడంతో పైపులైన్ కొద్దిగా పగిలి గ్యాస్ లీకైంది. వెంటనే గ్రామస్తులు గమనించి సుంకిశాలలోని మెయిల్ కంపెనీకి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే వచ్చి మరమ్మతులు చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

దాబాలలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 4 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని దాబాల్లో మంగళవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ మద్యం సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తెలిపారు.

గ్రామాభ్యుదయమే.. దేశాభ్యుదయం




భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన రవీంద్రుడు నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసి. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జన్మించిన ఈయన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించి రుషుల కాలం నాటి గురుకులాల తరహాలోనే విద్యాభ్యాసం అందించేవారు. గ్రామాభ్యుదయమే.. దేశాభ్యుదయమని, పల్లెల్లో పాఠశాలలు సరిగా ఉంటే దేశ భవిష్యత్ ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందంటారు. మతాలు వేరైనా కలిసి మెలిసి ఉండాలి అనే సాంఘిక ప్రయోజనం, ఉత్తమ సందేశం మిళితమైన 'గోరా' నవల రవీంద్రునికెంతో పేరు తెచ్చింది. విచిత్రమైన విషయమేమిటంటే చిత్రకళ మీద కలిగిన ఆసక్తితో ఆయన 70 ఏళ్ల వయస్సులో బొమ్మలు వేయడం ఆరంభించారు. ఆయన వేసిన చిత్రాలు లండన్, న్యూయార్క్, ప్యారిస్ మ్యూజియంలలో ప్రదర్శించారు.

అమెరికా దేశపు ప్రియ సహోదరులారా..!



స్వామి వివేకానంద అసలు పేరు.. నరేంద్రనాథ్ దత్తా. బెంగాల్ ప్రెసిడెన్సీలోని కోల్‌కతాలో జన్మించిన ఈయన ఉపాధ్యాయుడిగా, భారతదేశ యువతకు దిశా నిర్దేశం చేయడంలో ముందు వరుసలో ఉన్నారు. అందుకే ఈయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ఏటా జరుపుకుంటున్నాం. హిందూతత్వ చరిత్రపై భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్‌లలో యోగా, వేదాంత శాస్త్రాలను ఉపన్యాసాల ద్వారా పరిచేయం చేశారు. అమెరికాలోని షికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళంలో పాల్గొన్న ఆయన ఉపన్యాసకులందరిలో అత్యంత పిన్న వయస్కుడు. అయినప్పటికీ ఆయన ప్రసంగంతో అందరికంటే గొప్పవాడు అనిపించుకున్నాడు. ప్రసంగం ఆరంభంలో 'అమెరికా దేశపు ప్రియ సహోదరులారా..!' అంటూ మొదలుపెట్టగానే సభా ప్రాంగణమంతా మూడు నిమిషాలపాటు చప్పట్లతో దద్దరిల్లింది.



వరద నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలి

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి వచ్చిన వ ర్షపు నీరు వృథాగా పోకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నీటి పారుదలశాఖ అధికారులకు సూచించారు. దేవరకొండ పట్టణంలోని ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నీటి పారుదలశాఖ అధికారుల తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దుందుభి న ది నుంచి భారీగా నక్కలగండి రిజర్వాయర్‌లోకి వరదనీరు చేరుతుందని, రిజర్వాయర్‌కు ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిందని ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టుల పరిధిలోని కాల్వల ద్వారా చెరువులు, కుంటలలోకి నీటిని నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా స మావేశంలో నీటి పారుదలశాఖ ఈఈ శ్రీధర్‌రావు, డీఈలు శ్రీనివాస్, మ నోహర్, ఏఈలు పాల్గొన్నారు. అనంతరం దేవరకొండ మునిసిపాలిటీ కా ర్యాలయంలో పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కోర్టు పరిధిలో ఉన్న వాటిని వదిలి మిగతా భూ సమస్యలను త్వరత్వరగా పరిష్కరించాలని సూచించారు.



దేవరకొండలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

మట్టి వినాయకుల పంపిణీ


దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో మట్టి వినాయకులను ఎమ్మెల్యే బాలునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, క మిషనర్ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దఅడిశర్లపల్లి: ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 37మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే బాలునాయక్ పంపిణీ చేశారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్, పీ ఏపల్లి మండల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఆరు గ్యారెంటీ పథకాలు పేదలకు మరింత సహాయం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, గుడిపల్లి తహసీల్దార్ మధుహాసిని, మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, జిల్లా ప్ర ధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రె డ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామదాసురావు సారు రోల్ మోడల్





ఆచార్య ఎన్. గోపి, గోపి గురువు రామాదాసురావు (ఫైల్)

మా స్వస్థలం భువనగిరి. నా పాఠశాల విద్య ఇక్కడే సాగింది. తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు తోట రామదాసురావు సారు తెలుగు తెలుగు బోధించారు. బోధనా తీరుతో భాషా సాహిత్యాలపై ప్రేమ, అభిరుచిని కలిగించారు. పాఠశాల ఉపాధ్యాయుడైనప్పటికీ విశ్వవిద్యాలయ ఆచార్యుని స్థాయిలో మాకు పాఠాలు బోధించేవారు. 1965లో పాఠశాల విద్యార్థిగానే వచన కవిత్వంలో నేను రాసిన కవిత భారతి ప్రత్రికలో ప్రచురితమైంది. మరుసటి రోజు పాఠశాలలో జరిగిన ప్రార్థనా సమావేశంలో రామదాసురావు సారు నన్ను అభినందించిన మాటలు నేటికి మధుర జ్ఞాపకంగా ఉన్నాయి. పాఠ్యాంశాలతో పాటు జీవిత పాఠాలు, ఉన్నత లక్ష్యాలు, నైతిక విలువలు బోధించేవారు. ఆయన ప్రేరణతోనే నేను కవిగా, సాహితీవేత్తగా గుర్తింపు పొందాను. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ స్థాయికి ఎదిగాను. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందగలిగాను. రామదాసురావు సారు నాకు ఎల్లప్పటికీ ఓ రోల్ మోడల్. అలాంటి ఉపాధ్యాయులు ఉంటే సమాజానికి మేలు జరుగుతుంది.

● డాక్టర్ ఎన్. గోపి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్.

● భువనగిరిటౌన్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

హాలియా, తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 4: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియాలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, జగదీ‌ష్‌రెడ్డి, అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలపై ఖమ్మంలో కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యమే ఖమ్మం పట్టణం నీట మునగడానికి కారణమని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా రైతు భరోసాకు దిక్కులేదన్నారు. తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని సత్వరమే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భగత్ డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు జటావత్ రవినాయక్, వడ్డే సతీష్‌రెడ్డి, వెంకన్న, జానయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రవి పాల్గొన్నారు.

కాల్వకు అక్రమ తూములు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 4: డి-40 కాల్వకు అక్రమ తూములు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తప్పవని ఏఈ శివరాంప్రసాద్ హెచ్చరించారు. డి-40 కాల్వకు చివరి ఆయకట్టు ఇందుగుల రైతులు కాల్వకు అక్రమ తూములు ఏర్పాటు చేశారని బుధవారం రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు డి-40 కాల్వపై ప్రభుత్వం గతంలో 37 తూములను ఏర్పాటు చేసిందని, అయినా కొందరు రైతులు అక్రమ తూములను ఏర్పాటు చేయడం ద్వారా నీరు రావడం లేదని అధికారులు పేర్కొన్నారు. బుధవారం సర్వారం, పజ్జూరు, వెంకటాద్రిపాలెం తదితర గ్రామాల్లో అక్రమ తూములను తొలగించారు. కాల్వకు అక్రమ తూములు పెట్టి రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని, కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, నీటి పారుదల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తిరుమలగిరి(సాగర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో తరి రాము అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 2వ వారంలో జరిగే డివిజన్ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మండల స్థాయి బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, నరసింహారావు, సురేష్, గంగమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలం : బీజేపీ

వేములపల్లి, సెప్టెంబరు 4: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో చిత్రపరకవాగు ఉధృతికి కొట్టుకుపోయిన వరి పొలాలను బుధవారం ఆయన కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. వర్షాలకు జిల్లాలో సుమారు 800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆ రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తే రైతులకు లబ్ధి చేకూరేదని అన్నారు. వారి వెంట రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్, నాయకులు హనుమంతరెడ్డి, అభి, భరత్‌రెడ్డి, సీతారాంరెడ్డి, భరత్ ఉన్నారు.

స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి : సీపీఎం

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 4: వర్షాలతో గ్రామాల్లో అంటువ్యాధులు, ప్రబలకుండా స్థానిక సంస్థలకు కొన్ని ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుస్తున్న వ ర్షాలతో గ్రామాలు, పట్టణాలు బురదమయంగా మారాయని అన్నారు. డ్రైనేజీల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లడానికి కూడా స్థానిక సంస్థల వద్ద డబ్బులు లేవని అన్నారు. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు హాషం, సలీం, బండ శ్రీశైలం, నర్సిరెడ్డి, సత్తయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతు కుటుంబాల సర్వే

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 4: అన్ని గ్రామాల్లో రైతు రుణమాఫీ కాని రైతులకు సంబంధించి కుటుంబసభ్యుల వివరాలను సేకరిస్తున్నట్లు ఏడీఏ దేవ్‌సింగ్ అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలో బుధవారం ఆయన రైతు రుణమాఫీ సర్వేను పరిశీలించి మాట్లాడారు. రేషన్‌కార్డులు లేని రైతులు తమ కుటుంబసభ్యుల వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సైదానాయక్, ఏఈవోలు హిమబిందు, షఫీ, రైతులు శంకర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

హాలియా, పెద్దవూర, సెప్టెంబరు 4: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీల ను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చండూరులో ప్రారంభించిన మోటార్ సైకిల్ పోరుయాత్ర బుధవారం పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), హాలియాకు చేరుకుంది. యాత్రకు పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఏడు గంటలకు పాఠశాల సమయం పెట్టడం వల్ల విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఒక్కొక్క గురుకుల పాఠశాలలో 600మంది విద్యార్థులు ఉంటారని, ఉదయమే వంట చేయడం కూడా కష్టంగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, సుమారు 9 నెలలు గడుస్తున్నా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు విడుదల చేయలేదని, విద్యార్థులకు కడుపునిండా ఏ విధంగా భోజనం అందుతుందన్నారు. హాస్టళ్లలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్ర చేసి భోజనం చేస్తే విద్యార్థుల బాధలు అర్థమవుతాయని అన్నారు. ఈ నెల 10న చలో హైదరాబాద్ ఇందిరా పార్కులో వేలాది మంది విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎస్ఎ ఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, నాయకులు రమావత్ లక్ష్మణ్, కుర్ర సైదా, బడిగ వెంకటేష్, కోరే రమేష్, ముస్కు రవీందర్, జగన్, వీరన్న, సాయి, పావని, మౌనిక, స్పందన, రవి, కిరణ్, సంపత్, నవదీప్, ప్రవీణ్, న్యూమాన్, రాములు, బషీర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



హాలియాకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ మోటార్ సైకిల్ యాత్ర

తిరుమలగిరి(సాగర్): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నూతన భవనాన్ని మూ డేళ్లుగా నిర్మిస్తున్నారని, పనులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు

● జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు

దేవరకొండ, సెప్టెంబరు 4: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే డీలర్లపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. దేవరకొండలో రేషన్ డీలర్లతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కొంతమంది డీలర్లు రేషన్‌బియ్యాన్ని వినియోగదారులకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. రేషన్‌బియ్యాన్ని లబ్ధిదారులు ఇతరులకు విక్రయించవద్దని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. లబ్ధిదారులు రేషన్‌బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే రేషన్‌కార్డులు రద్దు చేస్తామని, డీలర్లు పక్కదారి పట్టిస్తే పీడీయాక్టు కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీరాములు, డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, రేషన్‌డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్వో వెంకటేశ్వర్లు

వినాయకచవితిని శాంతియుతంగా నిర్వహించుకోవాలి

దేవరకొండ, చండూరు, కొండమల్లేపల్లి, నకిరేకల్, కనగల్, సెప్టెంబరు 4: వినాయకచవితి వేడుకలను ఆనందోత్సహాలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, చండూరు సీఐ వెంకటయ్య, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, నకిరేకల్ సీఐ రాజశేఖర్, కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి అన్నారు. జిల్లాలోని పలుచోట్ల బుధవారం నిర్వహించిన శాంతి సంఘం సమావేశాల్లో వారు మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వినాయక ఉత్సవాలతో పాటు నిమజ్జనాన్ని పోలీస్‌శాఖ సూచనలు పాటించాలని అన్నారు. మండపాల ఏర్పాటుకు సంబంధించిన అన్ని రకాల అనుమతుల కు పోలీసుల అనుమతి తీసుకోవాలని అన్నారు. సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

● దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు మాట్లాడారు. ఇతరులను ఇబ్బందిపెట్టే విధంగా వ్యవహరించవద్దని కోరారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ నర్సింహ, సీఐ నర్సింహులు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, గణేష్ ఉత్సవకమిటీ నిర్వాహకులు, శాంతిసంఘం సభ్యులు పాల్గొన్నారు.

● చండూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సీఐ వెంకటయ్య మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ వెంకన్న, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.



దేవరకొండ: శాంతిసంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరాములు

● కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సీఐ ధనుంజయ్య మాట్లాడారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ రామ్మూర్తి, శాంతి సంఘం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సీఐ రాజశేఖర్ మాట్లాడారు. విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన వారు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు గోపికృ ష్ణ, లచ్చిరెడ్డి, నాయకులు మురారిశెట్టి కృష్ణమూర్తి, పన్నాల రాఘవరెడ్డి, వెంకన్న, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విష్ణుమూర్తి మాట్లాడారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు హఫీజుద్దీన్, వేముల నరహరి, నర్సింగ్ దనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిలను హాలియా మునిసిపాలిటీ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, నూతన కమిషనర్ రామదుర్గారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మునిసిపాలిటీ అభివృద్ధి, పలు విషయాల గురించి చర్చించారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఉషారాణి సందర్శించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

రామగిరి: లోకకల్యాణార్థమై ఈ నెల 17వ పట్టణంలోని విశ్వ బ్రాహ్మణ వసతిగృహంలో నిర్వహించే విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి పట్టణ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని యజ్ఞ కమిటీ నిర్వాహక అధ్యక్షుడు గుంటోజు బ్రహ్మాచారి పిలుపునిచ్చారు.

దేవరకొండ: దేవరకొండ లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని దేవరకొండ కిరాణ జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నీల బుచ్చయ్య అన్నారు. మండలంలోని జిల్లేపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, సంకు కొండల్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌కె ఆస్పత్రి యాజమాన్యం ఆర్థిక సహాయంతో 220 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో బీమా వారోత్సవాల సందర్భంగా సీనియర్ మేనేజర్ విజయానంద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్ మాట్లాడారు. ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఏజెంట్లకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామని, పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

నకిరేకల్: నకిరేకల్ మండలం డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.గోపాల్, ఉపాధ్యక్షులు సీహెచ్.వెంకటయ్య, ఆర్.వెంకటరమణ, ప్రధానకార్యదర్శి జగతి, కార్యదర్శులుగా ఎం.నాగరాజు, పి.జ్యోతి ఎన్నికైనట్లు తెలిపారు.

చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మునుగోడు రూరల్: రుణమాఫీకి అర్హులై ఉండి రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలు వ్యవసాయ అధికారుల వద్ద ఉన్న యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో పద్మజ సూచించారు.

కనగల్: మండలంలోని రేగట్టె జడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు అమ్మ ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ ఎర్రోల సురేష్, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: నల్లగొండ టీజీఎస్‌ఆర్టీసీ డిపోలోని కార్గో కౌంటర్‌ని టీజీఎస్‌ఆర్టీసీ బిజినెస్ హెడ్ శ్రీధర్ తనిఖీ చేశారు. నల్లగొండ రీజనల్ సేల్స్, రీజనల్ టీం ఎర్నింగ్‌ని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్గో వినియోగదారులకు లాజిస్టిక్ సేవలను ఎక్కువగా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏటీఎం రవీందర్, డిప్యూటీ ఆర్ఎంలు శివశంకర్, మాధవి, లాజిస్టిక్ రీజినల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: సూర్యాపేట డిపో నుంచి నల్లగొండకు వయా నకిరేకల్ నుంచి సూరారం మీదుగా 4 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సులను నడిపిస్తున్నట్లు నల్లగొండ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. సూర్యాపేట నుంచి ఉదయం 5.30 గంటలకు మొదలై రాత్రి 9 గంటల వరకు ప్రతి గంటకు బస్సు ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురువుల మాటలు స్ఫూర్తినిచ్చాయి




ఆనాటి గురువులతో వేణుగోపాల్‌రెడ్డి

మా సొంత గ్రామమైన నిడమనూరు మండలం ముకుందాపురంలో నా పాఠశాల విద్య పూర్తి చేశాను. పై చదువులకు మిర్యాలగూడ, హైదరాబాద్ వెళ్లాను. పాఠశాల విద్యలో ఆనాటి గురువుల మాటలతో స్ఫూర్తితోనే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. జానయ్య, జలాల్‌ఖాన్, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి అనే ఉపాధ్యాయుల ప్రభావం నా మీద ఎక్కువగా పడింది. భవిష్యత్తులో ఎలా ఎదగాలో వారు చెప్పిన మాటలు ప్రేరణ కలిగించాయి. ముఖ్యంగా ఇందులో గురువు జానయ్య ప్రభావం మరింతగా ఉండేది. స్కూల్ అయిపోయాక కూడా ఆయన మా ఇంటికి వచ్చి చదువుతున్నాడా, హోం వర్క్ చేస్తున్నాడా అనేది గమనిస్తూ, భవిష్యత్తుకు ఎలా బాటలు వేసుకోవాలో బాగా మోటివేట్ చేసేవారు. సాధారణ విద్యార్థిగా ఉన్న నేను వారి స్ఫూర్తితో పాఠశాల, కళాశాలలోనూ టాపర్‌గా తయారయ్యాను. ప్రస్తుతం ఉన్నత ఉద్యోగం చేస్తున్నా ఆనాటి గురువులను నిత్యం స్మరించుకుంటాను. జీవితంలో స్థిరపడేందుకు దోహదం చేసిన గురువులను ఇప్పటికీ తరచుగా కలుస్తుంటా. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే, వారిని పూజించడం మన బాధ్యత.

● నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ విభాగం, సంగారెడ్డి జిల్లా

● నిడమనూరు


గురువులే మన జీవితానికి మార్గదర్శకులు



తల్లిదండ్రుల తర్వాత మన జీవితానికి మార్గదర్శకులు గురువులే. వారి అడుగుజాడలో నడిచి మంచి పౌరులుగా ఎదగాలి. నా చిన్నప్పుడు ఆలేరు మండలం శారాజీపేటలో చదువు నేర్పిన శ్రీరామోజు హరగోపాల్ సార్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన చెప్పిన విద్య కారణంగానే నేను ఇంత స్థాయికి ఎదగగలిగాను. నాటి గురువులు ఎంతో ఆదర్శంగా ఉండేవారు. ఇప్పటి గురువులు కూడా అలాగే ఉంటూ చెడు వైపు పయనిస్తున్న విద్యార్థులను మంచి మార్గంలో నడిపిస్తూ వారిలో దేశ భక్తిని పెంపొందించాలి. రేపటి నవభారత నిర్మాతలుగా తయారు చేయాలి.

● చింతకింది మల్లేశం, ఆసు యంత్రం ఆవిష్కర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత శారాజీపేట

విద్య నేర్పిన గురువులకు వందనాలు



విద్యా బుద్ధులతో నన్ను తీర్చిదిద్దిన గురువులందరికీ హృదయపూర్వక వందనాలు. మహిళా లోకానికి తొలి పంతులమ్మగా నిలిచిన సామాజిక విప్లవ సావిత్రీబాయిని నేను ఆదర్శంగా స్వీకరిస్తాను. ఆమె జన్మదినమే నిజమైన ఉపాధ్యాయ దినం కావాలని నా ఆకాంక్ష. మా తరంలో ఉపాధ్యాయులు ఉన్న ప్రాధాన్యత రీత్యా నేటికీ వారిని పేరుపేరున గుర్తు పెట్టుకుంటున్నాం. ఒకే బడిలో రాజు, బంటు చదువుకుంటూ కుల మత భేదాలను మరిచి ఉండేవాళ్లం. ఆనాటి గురువులు సామాజిక బాధ్యతతో కేవలం పుస్తక బోధనలే కాకుండా క్రమశిక్షణతో మంచి నడవడి ఆటా పాటలన్నీ నేర్పించే వారు. తరగతి గదిలోనే సమాజ నిర్మాణానికి ఆస్కారం ఏర్పడింది.

● ఆలేరు రూరల్ ● విమలక్క, ఉద్యమకారిణి